చిన్నచింతకుంట 'స్వచ్ఛతా హీ సేవా'కార్యక్రమం పాల్గొన్న జడ్పీ సీఈవో శైలేశ్‌కుమార్

కొల్చారం: కిష్టాపూర్‌లో సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్డు ఊడుస్తున్న మహిళలు

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

జడ్పీ సీఈవో శైలేశ్‌కుమార్

నర్సాపూర్/కొల్చారం/చేగుంట/నిజాంపేట, అక్టోబర్1: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని జడ్పీ సీఈ వో శైలేశ్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేశవ్యాప్తంగా 'స్వచ్ఛతా హీ సేవా'పేరుతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆదివారం మండల పరిధిలోని చిన్నచింతకుంట గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించారు. పరిశుభ్రమైన, ఆరోగ్య సంరక్షణ కోసం పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని తడి, పొడి చెత్త ను వేర్వేరుగా చేసి పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో అధికారులు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మార్టిన్ లూథర్, ఎంపీవో వైద్య శ్రీనివాస్, సెక్రటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని కిష్టాపూర్‌లో సర్పంచ్ గోదావరి అన్నారు. ఆదివారం కొల్చారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆదివారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. కిష్టాపూర్‌లో సర్పంచ్ గోదావరి ఆధ్వర్యంలో మహిళలు రోడ్లు ఊడ్చారు. యేనగండ్లలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. మండల కేంద్రమైన కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మెడికల్ ఆఫీసర్ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది హాస్పిటల్ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలిగించారు. ఈ కార్యక్రమంలో డాక్రా మహిళలు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చందాయిపేటలో 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా శ్రమదానం చేస్తున్న సర్పంచ్ స్వర్ణలత తదితరులు

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రతి ఒక్కరూ తమ నివాసిత ప్రాంతాలను, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం కలుగుతుందని చందాయిపేట సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్, నడిమితాండ సర్పంచ్ స్వాతి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం చేగుంట మండల పరిధిలోని చందాయిపేట, నడిమితాండ గ్రామాల్లో ఆదివారం 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా గ్రామాల్లో శ్రమదానం చేశారు. పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డంప్ యార్డులను గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు పాల్గొని శుభ్రంగా చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులతో పాటు గ్రామస్తులు, పాలకవర్గం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్యకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంత గ్రామంగా మార్చుదాం

గ్రామస్తులంతా చెత్తను ఆరుబయట పారవేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందిస్తూ నందిగామను ఆదర్శవంతమైన గ్రామంగా మార్చుదామని సర్పంచ్ ప్రీతి పిలుపునిచ్చారు. ఆదివారం 'స్వచ్ఛతా హీ సేవా'కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గ్రామస్తులతో కలిసి ప్రధాన వీధుల వెంబడి శ్రమదానం కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. గ్రామస్తులు ఇంటి వద్దనే తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందజేయలని సూచించారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, ఎంపీటీసీ సురేశ్, వార్డు సభ్యుడు ఇమాంసాబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నడిమితాండలో శ్రమదానం చేస్తున్న సర్పంచ్ స్వాతి, గ్రామస్తులు

'స్వచ్ఛతా హీ సేవా'లో పాల్గొన్న నందిగామ సర్పంచ్ ప్రీతి, గ్రామస్తులు

మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లిం

ఉత్సాహంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

రామాయంపేట, అక్టోబర్ 1: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకొనే మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ముస్లింలు ఆదివారం రామాయంపేట పట్టణంలో శాంతి ర్యాలీలు ఉత్సాహంగా నిర్వహించారు. ముస్లింలు పవిత్రంగా భావించే జెండాలతో పాటు జాతీయ పతాకాన్ని చేతపట్టుకుని నిర్వహించిన ర్యాలీల్లో చిన్నాపెద్దా తేడాలేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాంసం విక్రయదారులకు నోటీసులిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేడు మాంసం విక్రయాలు బంద్

నర్సాపూర్, అక్టోబర్ 1:గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం (నేడు) నర్సాపూర్ పట్టణంలో మాంసము విక్రయించరాదని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని మాంసం దుకాణదారులకు మాంసం అమ్మకూడదని ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయిస్తే పురపాలక సంఘం చట్టం – 2019 ప్రకారం జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

శివ్వంపేట, అక్టోబర్ 1: విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికాంత్‌రావు కథనం ప్రకారం మండలంలోని చిన్నగొట్టిముక్లకు చెందిన గుమ్మడి యాదయ్య చిన్న కుమారుడు సునీల్ (25), అదే గ్రామానికి చెందిన బాలరాజుగౌడ్ వద్దకు పనినిమిత్తం వెళ్లగా సర్వీస్ వైర్‌ను కట్ చేయమని సునీల్‌కు చెప్పాడు. స్తంభం ఎక్కి సర్వీస్ వైర్ కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు సునీల్‌కు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

నూతనంగా ఏర్పాటైన నిజాంపేట పట్టణ ఆర్యవైశ్య కమిటీ

ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడిగా వెంకటేశం

నిజాంపేట, అక్టోబర్1: మండల కేంద్రం నిజాంపేటలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఆ సంఘం మండల అధ్యక్షుడు చెర్విరాల ప్రవీణ్ అధ్వర్యంలో ఏర్పాటైంది. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా వెంకటేశం, ఉపాధ్యాక్షుడిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా వెంకటేశం, కార్యదర్శిగా సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

రాయిన్‌పల్లిలో వయోవృద్ధులను సన్మానిస్తున్న మెదక్ ఆర్డీవో అంబదాస్‌రాజేశ్వర్

ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలి

మెదక్ రూరల్, అక్టోబర్ 1: వృద్ధులకు సముచిత స్థానం కల్పించి గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఆర్డీవో అంబదాస్‌రాజేశ్వర్ అన్నారు. మెదక్ మండలపరిధిలోని రాయిన్‌పల్లిలో ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, మెదక్ తాసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ సిద్దగౌడ్ కలిసి వయోవృద్ధులను ఘనంగా సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

చేగుంట తహసీల్ కార్యాలయంలో వృద్ధులను సన్మానిస్తున్న అధికారులు

వయోవృద్ధులకు సన్మానం

చేగుంట, అక్టోబర్1: చేగుంట తహసీల్ కార్యాలయంలో వయోవృద్ధులను సన్మానించారు. జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రమైన చేగుంటలోని తాసీల్దార్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 80 ఏండ్లకు పైబడిన వృద్ధులను ఘనంగా సన్మానించారు. వృద్ధులకు సముచిత స్థానం కల్పించి గౌరవించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో చేగుంట డిప్యూటి తాసీల్దార్, ఆర్ఐతో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి పైడి బాలకిషన్‌కు లడ్డూ అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం కమిటీ

రామాయంపేటలో లడ్డూ వేలం

● రూ.లక్షా 17 వేలకు దక్కించుకున్న పైడి బాలకిషన్

రామాయంపేట, అక్టోబర్ 1: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం లడ్డూ వేలం పాట భారీ స్పందన వచ్చింది. ఆదివారం రామాయంపేట పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డూను నిర్వాహకులు వేలం పాట నిర్వహించగా పట్టణానికే చెందిన ప్రముఖ వ్యాపారి పైడి బాలకిషన్ రూ.లక్షా 17 వేలకు దక్కించుకున్నాడు. ఆపిల్‌ను రూ.20 వేలకు బొజ్జ సునీల్, దానిమ్మ పండును రామాయపేటకే చెందిన అమరనాథ్ డెవలపర్ సంస్థ రూ.18 వేలకు దక్కించుకున్నారు.